క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, యోగా, లలిత సంగీతం తరగతులు నిర్వహించినట్లు లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. యోగా టీచర్ సబ్బిశెట్టి లీలాసుందరీ యోగాసనాల్లో మెళకువలు నేర్పించారు. ప్రింటోనికా కలర్ లాబ్ అధినేత గోకుల్ మురళీ విద్యార్థులకు మజ్జిగ వితరణ చేశారు.

రూ.25 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సాయిబాబా, ఏజెంట్లు

రాజమహేంద్రవరం రూరల్: భార్య మృతి, కుమారుడి అనారోగ్యంతో కష్టాల్లో ఉన్న ఎల్ఐసీ కార్యాలయం సెక్యూరిటీ గార్డు ప్రకాశ్‌కు ఏజెంట్లు ఆర్థిక సాయం అందించారు. సోమవారం ఎల్ఐసీ రూరల్ బ్రాంచి కార్యాలయంలో ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా చేతుల మీదుగా సెక్యూరిటీ గార్డుకు రూ.25 వేలు అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ రవి, ట్రెజరర్ యర్నాగుల మోహన్, ఎ.వెంకట్రావు, అన్నందేవుల అన్నవరం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ శంకర్ కుటుంబానికి పరామర్శ



భవానీశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీ శంకర్ కుటుంబ సభ్యులను గుడా మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరామర్శించారు. సోమవారం సంజీవ నగర్‌లోని నివాసానికి వెళ్లి భవానీ శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవానీ శంకర్ భార్య, మాజీ కార్పొరేటర్ బూరాడ కృష్ణమాధురి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట మరుకుర్తి రవియాదవ్, మాజీ కార్పొరేటర్ గరగ పార్వతి, గరగ మురళీకృష్ణ ఉన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పాదయాత్ర

ధవళేశ్వరం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం 100వ రోజుకు చేరుకోవడంతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం ధవళేశ్వరంలో పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పందూరి అప్పారావు ఆధ్వర్యంలో ధవళేశ్వరం పాత సామిల్లు నుంచి కాటన్ బ్యారేజీ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వంపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శలు చేశారు. అనంతరం నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. టీడీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిశీలకులు అంగర రామ్మోహనరావు, రూరల్ మండల అధ్యక్షుడు మత్సేట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

సిటీ ఎమ్మెల్యే భవాని ఆధ్వర్యంలో..

సీటీఆర్ఐ: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక తిలక్ రోడ్డులోని సాయిబాబా ఆలయం నుంచి శ్యామలానగర్‌లోని రామాలయం సెంటర్ వరకూ రాజమహేంద్రవరం సిటీ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర జరిగింది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని తదితరులు పాల్గొన్నారు.

689 మందికి వైద్యసేవలు



రాపాకలో ఇంటివద్ద ఉన్న రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రాపాకలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 689 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం రోజా, ఆశావర్కర్లు లలిత, లక్ష్మి, మణి పాల్గొన్నారు.

కాటన్ సేవలు స్ఫూర్తిదాయకం



అసోసియేషన్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నర్సరీ రైతులు



మార్గాని ఎస్టేట్స్‌లోని ఎంపీ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

- కొనియాడిన వక్తలు
- ఘనంగా జయంత్యుత్సవం

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మాణం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను ధాన్యాగారంగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు స్ఫూర్తిదాయకమని పోలవరం ప్రాజెక్టు సీఈ సుధాకర్ బాబు, క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎన్ పుల్లారావు, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు అన్నారు. ధవళేశ్వరంలో సోమవారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కాటన్ జయంతి వేడుకలకు వీరు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. తొలుత బ్యారేజీ సెంటర్‌లోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఈ ప్రదీప్‌కుమార్, ఏఈ అద్దంకి సాయిరామ్, అధికారులు, లస్కర్లు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ జయంతిని ఏపీఎన్జీవో అసోసియేషన్ ధవళేశ్వరం అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంతంలో ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు కాటన్ అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జైకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు, సహాధ్యక్షుడు బి.లక్ష్మణుడు, నాయకులు పీఎస్ శేషుకుమార్, సయ్యద్ బాజీ, సతీష్ కుమార్, శ్రీనివాసరావు, ఆదిత్య సోమేశ్వర్ పాల్గొన్నారు.

కాటన్ విగ్రహానికి ధాన్యాభిషేకం

కడియం: మండలంలోని దుళ్లలో ఆదర్శ రైతు అవార్డు గ్రహీత డాక్టర్ సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి) ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ధాన్యం, పాలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు గుర్రపు సత్యనారాయణ, చిట్టూరి అమ్మిరాజు, దూడల నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ తాతపూడి బాబీ, మాజీ ఎంపీటీసీ ఈదర నందేశ్వరరావు పాల్గొన్నారు.

కాటన్ సేవలు ఎనలేనివి

సర్ ఆర్థర్ కాటన్ సేవలు ఎనలేనివని నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ అన్నారు. కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, తిరుమలశెట్టి సూర్యభాస్కరరావు, తాడాల చక్రవర్తి, మార్గాని ఏడుకొండలు, ముద్రగడ జెమి, బొర్సు సుబ్బారాయుడు, ఆకుల గోపాలకృష్ణ, సింగంశెట్టి శ్రీను, తాళం నరేష్, ఈలి బేబీ పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



ధవళేశ్వరంలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు



దుళ్లలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భాస్కరరెడ్డి

సేవలు ఘనం.. సమాచారం శూన్యం

- రాజమహేంద్రవరం ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు
- రోగులకు కానరాని సమాచారం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి పేదల పాలిటి వరం. నిత్యం వందలమంది వచ్చి వైద్య చికిత్సలు చేయించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తోంది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరానికి మెడికల్ కళాశాల మంజూరు కావడంతో ప్రభుత్వాసుపత్రి మరింత అభివృద్ధి దిశగా ముందుకు వెళుతోంది. జిల్లా ఆసుపత్రి బోధనాసుపత్రిగా మారింది. త్వరలో వైద్య విద్యార్థులు రానున్నారు. సూపర్‌స్పెషాలిటీగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నిర్లక్ష్య ధోరణి..

అయితే మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధనాసుపత్రిగా మారకముందునుంచే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు తన సేవలు అందిస్తోంది. 16 రకాల స్పెషాలిటీ వైద్య సేవలతో రోగులకు వైద్య చికిత్సలు చేస్తోంది. కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ, అంకో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ వంటి సేవలన్నీ ప్రభుత్వాసుపత్రిలో అందించేందుకు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు ముందుకు వచ్చారు. ప్రారంభంలో ఈ సేవలను అట్టహాసంగా ప్రారంభించారు. అప్పటి వైద్యాధికారులు వీరికనుగుణంగా ప్రవర్తించేవారు. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధనాసుపత్రిగా మారిన తర్వాత ప్రస్తుత వైద్యాధికారుల నిర్లక్ష్య ధోరణితో పూర్వ వైభవం కోల్పోతోంది.



రాజమహేంద్రవరం ఆస్పత్రి

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

బోధనాసుపత్రిలో ప్రైవేట్ వైద్యసేవలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు నగరంలోని ప్రైవేట్ వైద్యులు ఆ సమయాల్లో వచ్చి రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటి వరకూ మొత్తం 30 మంది వరకు ప్రైవేట్ వైద్యులు బోధనాసుపత్రికి వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. ఆయా విభాగాల వైద్యులు వచ్చే సమయాలు, ఏ రోజు వస్తారో తెలిపే సమాచారం ఉండడం లేదు. దీంతో ఇదంతా బూడిదతో పోసిన పన్నీరవుతోంది.

డిస్‌ప్లే బోర్డులు తయారుకాలేదు



బోధనాసుపత్రికి ప్రైవేట్ వైద్యులు వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. వారికి సంబంధించి డిస్‌ప్లే బోర్డులు ఇంకా తయారుకాలేదు. అలాగే సంబంధిత డాక్టర్ వచ్చే రోజు, సమయాలు తెలియడం లేదు. దీనివల్ల కొంత ఇబ్బంది అవుతోంది. సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు రోగులకు అందిస్తున్నాం. ఐఎంఏ వైద్యులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలిపితే వెంటనే పరిష్కరిస్తాం.

– డాక్టర్ మనోజ్, బోధనాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్

పెళ్లి వేడుకలో ఇరువర్గాల ఘర్షణ

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో సోమవారం జరిగిన పెళ్లి వేడుకలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి, పలువురికి గాయాలయ్యాయి. రామచంద్రపురానికి చెందిన జిత్తుగ సుబ్రహ్మణ్యం (సుబ్బారావు)కు, తాళ్లపూడి మండలం గజ్జరానికి చెందిన శ్రీపూజితతో రామచంద్రపురంలో వివాహమైంది. ఈ నేపథ్యంలో పెళ్లికుమార్తెను డ్యాన్స్ చేయమని పెళ్లికొడుకు బంధువులు ఒత్తిడి చేయడంతో, పెళ్లికుమార్తె అన్నయ్య తిరస్కరించాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి దాడులకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ, సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి.. ఇరువర్గాలతో మాట్లాడి సఖ్యత కుదిర్చారు. అప్పటికే గాయాలైనవారు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై ఇరువర్గాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

బిక్కవోలు: మద్యం అక్రమంగా తరలిస్తున్న తొస్సిపూడి గ్రామానికి చెందిన చింతా సత్యనారాయణరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.వెంకటలక్ష్మి సోమవారం తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ బాటిళ్లు 10 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించి రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు.

భూగోళం మండేలా..



నిర్మానుష్యంగా ఉన్న రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డు



కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో కనిపించని జనసంచారం



వెలవెలబోతున్న వైజంక్షన్

భానుడు విశ్వరూపం చూపించాడు. భూమిపై నిప్పులవాన కురిపించాడు. సోమవారం కాసిన ఎండకు ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం పది గంటల నుంచి ఎండతీవ్రత మొదలైంది. మధ్యాహ్నం వేళ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఎండ దెబ్బకు రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి.

– రాజమహేంద్రవరం సిటీ

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



స్పందనలో సమస్యలు వింటున్న కమిషనర్ దినేష్ కుమార్



స్పందనలో పాల్గొన్న రూరల్ తహసీల్దార్ చిన్నారావు, పరిపాలనాధికారి సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్నకు చెబుదాం 1902కు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలని నగర కమిషనర్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 24 అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పౌరసేవలు, తాగునీరు, పారిశుధ్య సమస్యలపై సత్వరం స్పందించాలన్నారు. జేకేసీని ఏరోజుకారోజు ఓపెన్ చేసి పరిష్కారం చూపాలన్నారు. ఆ విభాగానికి ప్రత్యేక అధికారిగా నాగమణిని నియమించామన్నారు. జిల్లాస్థాయిలో పెండింగ్‌లో ఉన్న వాటికి సంబంధించి ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ పర్యవేక్షణ బాధ్యతలు అదనపు కమిషనర్ సత్యవేణికి అప్పగించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

స్పందనకు ఒక అర్జీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ వచ్చింది. తహసీల్దార్ పైడి చిన్నారావు, మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి సుబ్బారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. బొమ్మూరు గ్రామానికి చెందిన బుదరవలస చంద్ర అనే మహిళ తాము కొనుగోలు చేసిన రేకులషెడ్డును కడియాల సుభద్ర అనే మహిళ తనదంటోందని, పూర్వపరాలు పరిశీలించి న్యాయం చేయాలని కోరింది. చంద్ర ఇచ్చిన ఫిర్యాదును బొమ్మూరు పోలీస్ స్టేషన్‌కు బదలాయిస్తున్నట్లు పరిపాలనాధికారి సుబ్బారావు తెలిపారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికకు హాజరైన క్రీడాకారులు

ప్రకాశం నగర్: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ వాలీబాల్ కోర్టులో సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ధనుంజయ్, సూరిబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 19 నుంచి 25 వరకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం 28న పశ్చిమ బంగాలో జరిగే 45వ సబ్ జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుంచే యశ్వంత్, స్టేట్ వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీభగవాన్ దాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.సత్యవర్మ, జిల్లా అధ్యక్షుడు ఎ.రామరాజు పాల్గొన్నారు.

వృద్ధురాలికి మత్తు మందిచ్చి చోరీ

బిక్కవోలు: వృద్ధురాలికి ప్రసాదంలో మత్తు మందు కలిపిచ్చి చోరీకి పాల్పడిన ఘటన పందలపాకలో చోటుచేసుకుంది. ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీన పందలపాక జెండా సెంటర్ సమీపంలో ఒంటరిగా నివాసముంటున్న గొలుగూరి ఆదిలక్ష్మి అనే వృద్ధురాలి ఇంటికి గుర్తు తెలియని మహిళ వచ్చి దేవుడి ప్రసాదం తినమని ఇచ్చింది. ప్రసాదం తిన్న కొంతసేపటికే ఆమె స్పృహ తప్పిపోయింది. వృద్ధురాలు వడదెబ్బకో, బీపీ ఎక్కువయ్యో పడిపోయి ఉంటుందనుకున్న ఆమె కోడలు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు జరిగిన విషయం చెప్పడంతో కుటుంబసభ్యులు ఇంట్లో వెతకగా బీరువాలో ఉండాల్సిన మూడు కాసుల బంగారపు తాడు మాయమైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

సీతానగరం: మండలంలోని వంగలపూడి, పురుషోత్తపట్నం తదితర గ్రామాల ఏటిగట్టుపై వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సోమవారం స్పందనలో అర్జీ వచ్చిందని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. గ్రామాల వద్ద ఏటిగట్టుపై లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని శివ అర్జీ అందజేశారన్నారు.